ఎండవేడి తట్టుకునేలా చర్యలు తీసుకోవాలి 8లో..
కొండగట్టులో ముడుపుల ఆదాయం రూ.1.53 లక్షలు 7లో..

లెక్క తప్పితే.. గండమే..!



- ఎన్నికల్లో ప్రచార వ్యయం సమర్పించాల్సిందే
- జిల్లాలో వ్యయ పరిశీలనకు ప్రత్యేక అధికారులు
- నిజామాబాద్ పార్లమెంట్ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన 68 మందిపై వేటు

జగిత్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిర్ణీత వ్యవధిలో ప్రచార వ్యయానికి సంబంధించిన వివరాలను సక్రమంగా సమర్పిస్తే వేటు పడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి లోక్ సభ నియోజకవర్గాల అభ్యర్థుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రచార మూ ప్రభావితం చేస్తుంది. ఆ ప్రచార వ్యయం కూడా పెరుగుతూ వస్తుంది. ర్యాలీలు, సభలు, సమావేశాలు, సభలకు జనాన్ని తరలించే వాహనాలు, భోజనాలు, టెంట్లు ఇలా ప్రతీ దానికి అభ్యర్థులు ఖర్చు చేయాల్సి వస్తుంది. వీట న్నంటికి కూడా ఎన్ని కల సంఘం స్థాని కంగా ధరలను అను సరించి చెల్లింపులను నిర్ధేశించింది. ఈ మేరకు వ్యయ వివరాలను అభ్యర్థులు నమోదు చేయాల్సి ఉంటుంది. బ్యాంకులో ఖాతా తెరిచి దాని ద్వారానే చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల ప్రచార వ్యయానికి సంబంధిం చి ప్రతీ ఖర్చు వివరాలను ఎన్నికలు పూర్తయిన తర్వాత నెల రోజుల్లోగా ఎన్నికల సంఘానికి సమ ర్పించాలి. లేని పక్షంలో ఆ తరువాత జరిగే ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుంది. అలా గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో వేటు పడిన వారిలో రాష్ట్ర వ్యాప్తంగా 107 మంది ఉండగా కేవలం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 68 మంది ఉన్నారు.

నామినేషన్ల నుంచే....

అభ్యర్థుల ర్యాలీలు, ప్రచారాలు, సభలు సమావేశాలు, భోజనాలు, వాహనాలు ఇతర అవసరాలకు సంబంధించి అధికారులు ఎన్నికల పక్కాగా లెక్కిస్తున్నారు. ప్రతి అభ్యర్థికి రూ. 95 లక్షల వరకు వెసులుబాటును కల్పించారు. పార్టీల సమక్షంలోనే స్థానిక ధరలకు అనుగుణంగా ఆమోద ముద్ర వేశారు. నామినేషన్ దాఖలు నుంచి ఓట్ల లెక్కింపు వరకు అభ్యర్థి వెచ్చించే ప్రతి పైసాకు లెక్క చూపాల్సిందే. నామినేషన్ వేయ డానికి ఒక రోజు ముందు తెరిచిన బ్యాంకు ఖాతాలో అభ్యర్థుల ఎన్నికల లావాదే వీలను నమోదు చేయాల్సి ఉంటుంది.

పక్కాగా దృష్టి సారిస్తున్న ఎన్నికల సంఘం...

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో అభ్యర్థులు నామినేషన్ల ఘట్టం పూర్తి చేసుకొని ప్రచారంపై దృష్టి సారించారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తవడంతో ప్రచార వ్యూహాలకు పదును పెట్టనున్నారు. మరో వైపు అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలైంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల రోజువారీ ఖర్చుల వివరాలను పక్కగా నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఒ క్కో అభ్యర్థి రూ. 95 లక్షలకు మించి ఖర్చు చేయరాదు. ఒకవేళ పరిమితి దాటితే ఎన్నికైనా సరే పదవికి గండం తప్పదు. గతంలో రూ. 70 లక్షలు ఉండగా ప్రస్తుతం రూ. 95 లక్షలకు ఎన్నికల సంఘం పెంచింది. ప్రచార సరళి, సభలు సమావేశాలు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు.



వ్యయ పరిశీలకుల పర్యటన...

రాష్ట్ర ఎన్నికల సంఘం నియామకం చేసిన వ్యయ పరిశీలకులు ఎప్ప టికప్పుడు ఆయా నియోజకవర్గాల్లో పర్యటి స్తున్నారు. నియోజకవర్గ పరిధి లోనే మకాం వేస్తా రు. ఓటర్లను ఎక్కడెక్కడ ఎలా ప్రభావితం చేస్తున్నా రు. ఖర్చు ఎలా పెడుతున్నారని అంచనాకు వస్తున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన 27 రోజుల తర్వాత మరోసారి ఇలా మూడు విడతల్లో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారు. అభ్యర్థుల వ్యయాలను నిశితంగా పరిశీలిస్తారు. లెక్కల్లో వ్యత్యాసం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే వివరాలను ఎన్నికల సంఘానికి పంపిస్తారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా డీఎం నింజే, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులుగా సమీర్ నరైంతర్ వ్యవహరిస్తున్నారు. వీరిరువురు ఇటీవల జిల్లాలో పర్యటించి అభ్యర్థుల ఎన్నికల వ్యయాలపై పరిశీలన జరిపారు.

వ్యవ పరిమితి పెంపు ఇలా..

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార వ్యయ పరిమితి 1952లో రూ. 25వేలుగా ఉండేది. 1971లో రూ. 35 వేలు ఉండగా, 1980లో రూ. లక్షకు పెరిగింది. 1984 నుంచి 1991 వరకు రూ. 1.50 లక్షలు, 1996లో రూ. 4.50 లక్షలకు చేరింది. 1998లో రూ. 15 లక్షలు, 2004లో రూ. 25 లక్ష లకు పెరుగుతూ వచ్చింది. 2014లో ఎన్నికల ప్రచార వ్యయ పరిమితిపై సవరణ జరిగి రూ. 70 లక్షలకు పెరిగింది. దీనిపై 2020లో మరో 10 శా తం పెరిగింది. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన కమిటీ సూచన మేరకు 2022లో ప్రచార వ్యయ పరిమితిని రూ. 95 లక్షలకు పెంచారు. ప్రస్తుతం లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు గరిష్టంగా రూ. 95 లక్షల వరకు ప్రచారానికి ఖర్చు చేసే అవకాశం ఉంది.

వ్యయ లెక్కలు సమర్పించనందుకు అనర్హులుగా..

గత చివరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వ్యయ లెక్కలను సక్రమంగా సమర్పించని కారణంగా రాష్ట్రంలోని 107 మందిని ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ప్రచార వ్యయానికి సంబంధించిన వివరాలు సమ ర్పించక పోవడంతో ప్రజాప్రాతినిధ్య చట్టం 1951-10 ఏ ప్రకారం అనర్హత వేటు వేసింది. వీరిలో అత్యధికంగా నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన 68 మంది ఉన్నారు. అప్పట్లో పసుపు రైతులు భారీ సంఖ్యలో నామినేషన్ వేసిన వారే కావడం గమనార్హం. వీరికి వచ్చే జూన్ 23 వరకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు.

ధర్మపురి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు షాక్

బుగ్గారం ఎంపీపీ, జడ్పీటీసీల రాజీనామా



రాజీనామా లేఖలు చూపిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీలు

జగిత్యాల టౌన్, మే 2 : ఎంపీ ఎన్నికల వేల ధర్మపురి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ప్రధాన అనుచరుడిగా పేరున్న బుగ్గారం జడ్పీటీసీ బాధినేని రాజేందర్ ఆయన సతీమణి బుగ్గారం ఎంపీపీ రాజమణిలు గురువారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా కేంద్రంలో రాజేందర్ విలేకరుల సమావేశం నిర్వహించి తమ రాజీనామా లేఖలను చూపిస్తూ మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి అభివృద్ధికి ఎంతగానో కృషి చేసినప్పటికీ చిన్నచూపు చూసిందన్నారు. మాజీ మంత్రి సైతం చిన్న చూపు చూసినట్లు అనిపించిందన్నారు. బీఆర్‌ఎస్‌ను వీడుతుంటే చాలా బాధగా ఉందన్నారు. త్వరలో భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామని వివరించారు.

కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ఇస్త్రీ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల టౌన్, మే 2 : జిల్లా కేంద్రంలో ఈ నెల 5న నిర్వహించనున్న మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా జిల్లా కేంద్రంలోని 1, 2, 3, 4. 17, 18 వార్డులతో పాటు జంబిగద్దె నుంచి అంగడి బజార్, తహసీల్ చౌరస్తా, మోచీ బజార్, టవర్ సర్కిల్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇస్త్రీ చేస్తూ, కూరగాయలు విక్రయిస్తూ కారు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 40 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా బీఆర్‌ఎస్ హయాంలో జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజల్లో విశ్వాసం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోళి శ్రీనివాస్, నాయకులు వొళ్లెం మల్లేశం, కూసరి అనీల్, ఆనందరావు, పవన్, మల్లారెడ్డి, శేఖర్ ఉన్నారు.

ప్రభుత్వాల వైఫల్యాలపై ఇంటింటికీ ప్రచారం చేయాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, మే, 2 : కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కార్యకర్తలకు సూచించారు. గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ప్రచారం చేపట్టారు. అనంతరం ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతి రేకత వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణ మాఫీ, పింఛన్, వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు, కౌలు రైతులకు రైతు బంధు, క్వింటాలు ధాన్యానికి రూ. 500బోనస్, కల్యాణ లక్ష్మీకి తులం బంగారం వంటి పథకాల హామీలు గురించి గ్రామాలకు వచ్చిన నాయకులను నిలదీ యాలన్నారు. హామీల పేరిట ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, ఐదు ఏండ్లు ఎంపీ అర్వింద్ అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల కోసం చేసింది ఏమి లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బలహీన వర్గాల అభివృద్ధి కోసం పోరాటం చేసిన రాజకీయ అనుభవం ఉన్న బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, రాజాగౌడ్, వెంకటేష్, గడ్డం రాంరెడ్డి పాల్గొన్నారు.



జగ్గసాగర్‌లోని సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

కొడిమ్యాల, మే 2 : మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి లేగ దూడను అడివి మృగం దాడి చేసి చంపిన నేపథ్యంలో బుధవారం రాత్రి గ్రామ పంచాయతీ పరిధిలో గల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ గ్రామ పంచాయతీ తరుపున దండోరా వేయించారు. వ్యవసాయ పనులకు వెళ్లే వారు, రాత్రి వేళల్లో ఇతర గ్రామాలకు రాక పోకలు సాగించె వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలి

సేవాభారతి అధ్యక్షుడు గాజంగి రాజమల్లయ్య



వేంపేటలో విద్యార్థులను సన్మానిస్తున్న సేవా భారతి అధ్యక్షుడు

మెట్‌పల్లి రూరల్, మే, 2 : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సేవా భారతి అధ్యక్షుడు గాజంగి రాజమల్లయ్య అన్నారు. మండంలోని వేంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులు పదవ తరగతిలో 10జీపీఏ సాధించిన ఏలేటి హర్షిణి, నామాబాద్ నేహ, మారు హవీల, సుమయాలను గురువారం శాలువలతో సన్మానించి స్వీట్లు తినిపించి అభినందించారు. తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకోచ్చే విధంగా విద్యార్థులు శ్రమించాలన్నారు. నాయకులు గాజంగి జయకృష్ణ, ఏలేటి ముత్తయ్య రెడ్డి, ఏలేటి తిరుపతి, సలీం, సేవా భారతి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

ధర్మపురి : ధర్మపురి పట్టణంలో 10 జీపీఏ సాధించిన ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులను గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్‌లో 41 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. ఇందులో ఆరుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు.

వారందరిని తన నివాసం వద్ద అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్, ప్రిన్సిపల్ తోట శంకర్, డైరెక్టర్ గట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు రాజారాంపల్లిలో జనజాతర సభ

● హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎండపల్లి, మే 2: మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జనజాతర సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఇప్పటికే సభ నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు. సభా ప్రాంగణాన్ని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ పరిశీలించించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరుగనున్న సభకు ప్రత్యేక వేదికను హెలీ ప్యాడ్‌ని సిద్ధం చేశారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, డీఎస్పీ రవి చందర్ ఇప్పటికే సభా ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. సభకు పెద్ద ఎత్తున జనం హాజరుకానున్నందున పోలీసులు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. సభకు వచ్చే వాహనాల దారి మళ్లింపుపై అధికారులు పలు సూచనలు చేశారు. జగిత్యాల నుంచి ధర్మారం వచ్చే వాహనాలు ఎండపల్లి మీదుగా వెళ్లాలని, ధర్మారం నుంచి జగిత్యాల వెళ్లాలంటే మల్లన్న గుట్ట సమీపంలోని దారి గుండా వెళ్లేటట్లు ఏర్పాట్లు చేశారు. సభ ప్రారంభం నుంచి తిరిగి వెళ్లే వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కావాల్సిన ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుల్, ఇతర సిబ్బంది సుమారు 400 మంది బందిబస్తులో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

భూకబ్జా కేసుల్లో నిందితులకు పోలీస్ కస్టడీ



నిందితులను కస్టడీకి తీసుకుంటున్న సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్‌క్రైం, మే2: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇంటి స్థలాన్ని కాజేసేందుకు యత్నించిన, విక్రయదారులను బెదిరింపులకు గురిచేసి డబ్బు దోపిడీకి పాల్పడిన కేసులో నలుగురు, నకిలీ పత్రాలతో ఇంటిని కూల్చిన కేసులో ఐదుగురు మొత్తం 9 మంది నిందితులను గురువారం కస్టడీకి తీసుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కరీంనగర్ బ్యాంకు కాలనీకి చెందిన దొమ్మటి యుగందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 18వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవితో పాటు ఆమె భర్త కృష్ణ గౌడ్, కొత్త జైపాల్‌రెడ్డి, మున్సిపల్ ఆర్‌ఐ జంకే శ్రీకాంత్, మున్సిపల్ బిల్ కలెక్టర్ కొత్తపల్లి రాజుతో సహా మొత్తం 12 మందిపై కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా, అందులో నలుగురు నిందితులు మొహమ్మద్ ఫిరోజ్‌ఖాన్, కాంపెల్లి రామాంజనేయులు, జంకే శ్రీకాంత్, కొత్తపల్లి రాజులను ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన మరింత కీలక సమాచారం సేకరించేందుకు జైలులో ఉన్న నలుగురు నిందితులని కోర్టు అనుమతి ద్వారా గురువారం ఉదయం 10:30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీకి తీసుకున్న నలుగురు నిందితులను విచారించటంతో పాటు వారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నామని సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు.

● బుల్డోజర్ గ్యాంగ్ అరెస్టు కేసులో కరీంనగర్ జైలులో ఉన్న నిందితులు బారాజు రత్నాకర్‌రెడ్డి, చందా శంకర్‌రావు, బకిట్ సాయి, పిట్టల మధు, షాహిద్‌ఖాన్‌లను కొత్తపల్లి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారించేందుకు అనుమతి కోరుతూ కోర్టు ద్వారా గురువారం ఉదయం 10:30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10:30 గంటల వరకు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీకి తీసుకున్న ఐదుగురు నిందితులను విచారించటంతో పాటు వారి ఇళ్లల్లో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నామని సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు.

ఊటూర్ సింగిల్‌విండో అధ్యక్ష, కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

మానకొండూర్, మే 2 : మండలంలోని ఊటూర్ సహకార సంఘం అధ్యక్షులు ముద్దసాని ప్రదీప్‌రెడ్డి కార్యదర్శి మిట్టపల్లి రవీందర్‌లకు గురువారం జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత నెల 16న సహకార సంఘంలో జరిగిన విచారణ నివేధికను విచారణ అధికారి రాజు డిసీవోకు అందజేశారు. దీంతో సహకార సంఘంలో కార్యదర్శి రవీందర్ తీసుకున్న వ్యక్తిగత రుణం రూ. 3.53లక్షలు, సంఘంలో రూ. 24లక్షల ఓవర్‌ద్యూ బినామీలకు అప్పుగా ఇచ్చారని అధ్యక్ష కార్యదర్శులు ఆ రుణాన్ని వసూలు చేయాలని జారీ చేసిన షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. పదిరోజుల్లోగా ఎంసీ సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన నోటీస్‌లో పేర్కొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● రూ. 67,700, 8 తులాల వెండి స్వాధీనం



దొంగలను అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

జగిత్యాల టౌన్, మే 2 :తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను గురువారం జగిత్యాల పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద రూ. రూ. 67,700 వేల నగదు, 8 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశం నిర్వహించి ఇద్దరు దొంగలను అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట చెందిన విబూది శేఖర్ గత ఐదు సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఆలయాలతో పాటు ఇళ్లలో దొంగతనాలు చేసి జల్సాలకు అలవాటు పడ్డాడు. 10 దొంగతనాల కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో శేఖర్‌కు బుగ్గారం మండలం బీర్‌సాని గ్రామానికి చెందిన గుమ్మాల వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం జిల్లా కేంద్రంలో ఏడు ఇళ్లలో చొరబడి రూ.1.11 లక్షల నగదు, 8తులాల వెండిని నగలను దోచుకున్నారు.

పోలీసులు గురువారం కరీంనగర్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా పట్టుబడ్డారు. విచారణలో దొంగలుగా గుర్తించి వారి వద్ద రూ. 67,700 వేల నగదు, 8 తులాల వెండి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మథ రావు, నరేష్ తదితరులు ఉన్నారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. మంగళవారం ఇరువై మంది రైతులు 324క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.5200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

భూ కబ్జాకు యత్నించిన వ్యక్తి అరెస్టు

చొప్పదండి, మే 2: తప్పుడు డాక్యుమెంట్లతో భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ ఉపేంద్రాచారి కథనం మేరకు రుక్మాపూర్‌కు చెందిన 15ఏ సర్వే నెంబర్‌లో 35 గుంటల భూమిని రుక్మాపూర్‌కు చెందిన ముద్దసాని రంగయ్య, వంగ సురేష్, చొప్పదండికి చెందిన గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం ఇంద్రసేన రెడ్డిలు 2017లో కొనుగోలు చేశారు. ఈ భూమి తనదేనని ముద్దసాని రాజయ్య కోర్టులో కేసు వేయగా అనంతరం లోక్ అదాలత్‌లో నలుగురు రాజీ పడ్డారు. కాగా ఈ భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో గ్రామానికి చెందిన ముద్దసాని కొమురయ్య, లంక శేఖర్‌లు ముద్దసాని రాజయ్య వద్ద 2013లో రూ.34 లక్షలకు కొనుగోలు చేసినట్లు సాదా బైనామా కాగితాన్ని సృష్టించి భూమిని వివాదం చేశారు. నలుగురు పట్టాదారులను మోకాపై భయభ్రాంతులకు గురి చేశారని ముద్దసాని రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దసాని కొమురయ్య, లంక శేఖర్‌లపై చీటింగ్, ఫోర్జరీ ఫాల్సిఫికేషన్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ముద్దసాని కొమురయ్యను అరెస్టు చేసి రిమాండుకు పంపించగా, లంక శేఖర్ కరీంనగర్ రూరల్‌లో నమోదైన కేసుకు సంబంధించి జైలులో ఉన్నట్లుతెలిపారు.

అక్కాచెల్లెళ్లను అప్పగించిన పోలీసులు

మల్యాల, మే 2: అదృశ్యమైన అక్కాచెల్లెళ్లను పోలీసులు తండ్రికి అప్పగించారు. మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన అక్కాచెల్లెల్లు వైష్ణవి(17), ప్రసన్న(15)లు మంగళవారం రాత్రి మేడపైన పడుకోగా బాత్రూంకు అని కిందకు దిగి ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాక పోవడంతో తండ్రి బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాలికల తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై అబ్దుల్ రహీం, పోలీసులు పలు చోట్ల గాలింపు చేపట్టారు. అయితే ఆధార్‌కార్డులు వెంట బెట్టుకొని బయలుదేరిన అక్కాచెల్లెల్లు ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్‌కు వెళ్లి అక్కడ నుంచి బుధవారం రాత్రి జగిత్యాల బస్టాండ్‌కు తిరిగివచ్చారు. వారిని గమనించిన కొందరు మల్యాల పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై అబ్దుల్ రహీం, పోలీసులు అక్కడకు చేరుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారించి తండ్రికి అప్పగించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మల్యాల, మే 2: దిగువ కొండగట్టులో ద్విచక్ర వాహనం చోరీకి గురి అయింది. పంజాల మల్లేశంగౌడ్‌కు చెందిన ద్విచక్రవాహనంను బుధవారం రాత్రి ఇంటి ముందు పార్క్ చేసి పెట్టగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దాంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు జరుపుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న మాధవానందస్వామి



మాధవానంద స్వామికి పండ్లు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

వేములవాడ, మే 2: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని తొగుట పీఠాధిపతి మాధవానందస్వామి గురువారం దర్శించుకున్నారు. స్వామీజీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేక పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, స్థానాచార్యులు అప్పాల బీమా శంకర్, అర్చకులు స్వామీజీకి పండ్లు అందజేశారు. అనంతరం స్వామీజీ ఆశీర్వచనం గావించారు. ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకులు తిరుపతి రావు, ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, ఈవో సీసీ ఎడ్ల శివసాయి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం, మే 2 : కరీంనగర్ పట్టణంలో ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 16 మంది వ్యక్తులను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా జడ్జి ఇందులో నుంచి ఒక వ్యక్తికి ఏడు రోజుల జైలు శిక్ష మరొక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష, ఇంకొక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం రూ. 4,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మిగతా 13 మంది వ్యక్తులకు 18 వేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

రాజీ మార్గంలో 43 సంవత్సరాల ఆస్తి వివాదం పరిష్కారం

జగిత్యాల టౌన్, మే 2 :జగిత్యాల కోర్టులో 43 సంవత్సరాలుగా కొనసాగుతున్న వారసత్వ ఆస్తి వివాదం గురువారం రాజీమార్గం ద్వారా పరిష్కారం అయింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన రుద్రంగి నర్సయ్య, రుద్రంగి రాజన్న, విశ్వనాథం అనే ముగ్గురు సోదరుల మధ్య తన తండ్రి స్థిర, చర ఆస్తుల పంపిణీ విషయంలో వివాదం ఏర్పడింది. 1981లో ఈ వివాదం జగిత్యాల కోర్టు ఏర్పడగానే మొదలైంది. వీరికి జగిత్యాల బ్రాహ్మణవాడతో పాటు జగిత్యాల అర్బన్ మండలం మోతె, తిప్పన్నపేటలో స్థిర, చర ఆస్తులు ఉన్నాయి. కోర్టులో కేసు కొనసాగుతుండగానే రాజన్న, విశ్వనాథంలు అనారోగ్యంతో మృతి చెందారు. అయితే నర్సయ్య తన సోదరుల వారసులతో రాజీ కుదుర్చుకోగా న్యాయవాదులు మహేందర్, సుబ్రహ్మణ్యం, మురళీధర్ రావులు తమ వాదనలను సివిల్ జడ్జి ప్రసాద్ సమక్షంలో రాజీ కుదిర్చారు. దీంతో 43 సంవత్సరాలుగా వారసత్వ ఆస్తి వివాదం ముగిసింది.

జగిత్యాలలో రేషన్ బియ్యం పట్టివేత



ఆటోలో తరలిస్తున్న బియ్యం సంచులు

జగిత్యాల టౌన్, మే 2 : జగిత్యాల జిల్లా కేంద్రంలో రేషన్ బియ్యం అక్రమ దందా కొనసాగుతూనే ఉంది. జిల్లా కేంద్రంలోని బీట్ బజార్ ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని కొంతమంది ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా వాహనానికి పంక్చర్ అయ్యింది. దీంతో వారు అక్రమ రేషన్ బియ్యాన్ని ఒక ఆటో నుంచి మరో ఆటోలో తరలించే క్రమంలో స్థానికుల సమాచారంతో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు రెండు ఆటోలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట, మే 2:సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో గురువారం నేరాల నియంత్రణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 100 డయల్ చేయాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఏఎస్సై శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కోటి 51 లక్షలకు పైగా నగదు జప్తు

● కోటి 48 లక్షలకు పైగా విడుదల ● పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన తనిఖీలలో ఇప్పటివరకు కోటి 51లక్షల 38వేల 82 రూపాయలను జప్తు చేసి, సరైన ఆధారాలు పరిశీలించి గ్రీవెన్స్ కమిటీ కోటి 48 లక్షల 58 వేల 702 రూపాయలను విడుదల చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 6లక్షల 81 వేల 830 రూపాయలు, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 17 లక్షల 5 వేల 500, చెన్నూరు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 8 లక్షల 59 వేల 200 రూపాయలు, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 49 లక్షల 41 వేల 922, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 15లక్షల 76 వేల 330 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించిన గ్రీవెన్స్ కమిటీ పూర్తిస్థాయిలో నగదును విడుదల చేసిందన్నారు. రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 22 లక్షల 90 వేల 90 రూపాయలు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి 20 లక్షల 61 వేల 710 రూపాయలను, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 30 లక్షల 83 వేల 210 రూపాయలు నగదు సీజ్ చేయగా, ఆధారాలను పరిశీలించి 30లక్షల 32 వేల 210 రూపాయలను విడుదల చేశామన్నారు. సరైన ఆధారాలు సమర్పించని కారణంగా 2లక్షల 79వేల 380 రూపాయలు విడుదల చేయలేదన్నారు. ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన తనిఖీలలో జప్తుచేసిన సొమ్ము, ఆభరణాలపై ప్రతిరోజు కలెక్టరేట్‌లోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో గ్రీవెన్స్ కమిటీ ప్రతిరోజు సమావేశం నిర్వహించి, ఆధారాలను పరిశీలించి జప్తు చేసిన నగదు, ఆభరణాలను విడుదల చేస్తుందని, తనిఖీల సమయంలో నగదు, ఆభరణాలు జప్తునకు గురైతే ఆందోళన చెందకుండా వాటికి సంబంధించిన ఆధా రాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీకి సమర్పిస్తే వెంటనే విడుదల చేస్తుందని ప్రకటనలో తెలిపారు.

కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న వ్యక్తి రిమాండ్

మెట్‌పల్లి, మే, 2 : కోర్టు కేసుకు కొన్ని రోజుల నుంచి హాజరు కాకుండా తిరుగుతున్న బోందు గణేష్‌సింగ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన బోందు గణేష్‌సింగ్‌పై కేసు నమోదు కావడంతో కోర్టులో హాజరు కావాల్సి ఉంది. కానీ కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న గణేష్‌పై నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ ఉంది. దీంతో ఆయనను పట్టుకుని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

● లోక్‌సభ ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని మెట్‌పల్లి సీఐ నవీన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా దిచక్ర వాహనంపై రూ. 1,70వేల నగదును తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. పట్టుకున్న వ్యక్తి నుంచి నగదును స్వాధీనం చేసుకుని సంబంధిత అధికారులకు అప్పగించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ. 50వేలకు మించి ఉంటే వాటికి సంబంధించిన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

తానా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్



సుభాష్‌నగర్, మే 2: తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(తానా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రంలోని వాసుదేవ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లాల్లో తానా శాఖల ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రామానుజమ్మకు కాంస్యం

సిరిసిల్ల టౌన్, మే 2: జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పరుగు పందెంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన టమటం రామానుజమ్మ కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గురువారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామానుజమ్మను మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. ఏప్రిల్ 26 నుంచి 28 వరకు ముంబాయి విద్యావిహార్ (ఈస్ట్)లోని సోమయ్య అథ్లెటిక్స్ ట్రాక్‌పై 43వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ - 2024 పోటీలు నిర్వహించారు. పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి రామానుజమ్మ హాజరయ్యారు. మహిళల 70ప్లస్ విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో రామానుజమ్మ మూడో స్థానంలో నిలిచింది. ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేబీ నాగూర్, ప్రధాన కార్యదర్శి వికాస్‌చౌవన్ కాంస్య పతకంతో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు.



కాంస్య పతకంతో రామానుజమ్మ

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

గణేశ్‌నగర్, మే 2: విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ప్రతి డివిజన్, సబ్ డివిజన్‌లో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ భద్రత ప్రాముఖ్యతను వివరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేయాలని అన్నారు. మే1 నుంచి 7వరకు వారం రోజులు విద్యుత్ భద్రత సమావేశాలు నిర్వహించి అందరికీ కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. రైతులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం, వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినప్పుడు కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడం వలన విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయ పంపుసెట్లను స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా ఎర్త్ చేయబడని పరికరాల వల్లే జరుగుతాయన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమన్నారు. గృహాలలో అతుకులు లేని సర్వీసు వైరును మాత్రమే ఉపయోగించాలని ఎస్ఈ సూచించారు. చేపలు పట్టడానికి విద్యుత్ తీగలు వాడరాదన్నారు. కొన్ని చోట్ల జంతువుల నుంచి పంట రక్షణ కొరకు విద్యుత్ ఫెన్సింగ్ వేస్తున్నారని ఇది చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలకు ఫిర్యాదులు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబరు 18004250028కు లేదా 1912కు ఫోన్ ద్వారా తెలపాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, రాజేశం ,లావణ్య, ఆ.చంద్రయ్య, హబీబా, సురేష్ కుమార్, శ్రీహరి, మునీందర్, చంద్రశేఖర్, పండరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఈ గంగాధర్

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మే 2: పట్టణంలోని ఆదర్శనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన కస్తూరి పద్మ కుమారుడు క్రాంతికుమార్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. పద్మ తన కోడలితో నివాసం ఉంటోంది. బుధవారం పద్మ తన కోడలుతో మెట్‌పల్లి పట్టణంలో బంధువుల ఇంటికి ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటి తాళం పగుల గొట్టి ఉండటంతో గమనించిన కాలనీవాసులు విషయాన్ని పద్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పద్మ ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని సామగ్రి చిందరవందరగా పడి ఉండి బీరువా తెరిచి ఉండడంతో స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ కిరణ్ కుమార్ విచారణ చేపట్టారు. బీరువాలో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలతో పాటు ఇంటి ఆవరణలో ఉన్న ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేసి విచారణ చేపట్టారు.

పొలాల్లో అగ్ని ప్రమాదం.. విద్యుత్ పరికరాలు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 2: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం ప్రాంతంలో గురువారం వ్యవసాయ పొలాల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలోని రైతులకు చెందిన సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను కోసి గడ్డిని పొలాల్లో ఉంచారు. ఒక్కసారిగా పొలాల్లో మంటలు వ్యాపించాయి. రైతులు దేవయ్య, నాగరాజు, అంజయ్యలతో పాటు మరో సుమారు పది మంది రైతులకు చెందిన సాగునీటి పైపులు, విద్యుత్ స్టార్టర్లు, కరెంటు తీగలు కాలిపోయాయి. చుట్టుపక్క రైతులు చేరుకొని సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొన్నారు. వరి పంటను కోసి గడ్డికి నిప్పుపెట్టడం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని భావిస్తున్నారు. తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

● కోనరావుపేట:మండలంలోని ధర్మారంలో ప్రమాదవశాత్తు వరి కొయ్యలకు నిప్పు అంటుకొని పలువురు రైతులకు చెందిన కరెంటు మోటార్లు, స్టార్టర్లు, కరెంటు వైర్లు దగ్ధమయ్యాయి. సుమారు 20 మంది రైతులకు చెందిన పరికరాలు దగ్ధం కావడంతో రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.



పొలాల్లో చెలరేగుతున్న మంటలు

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

కొడిమ్యాల, మే 2: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో జనవరి 31న రాత్రి రేండ్ల ప్రమీల ఇంటిలో దొంగతనం చేసిన కేసులో నిందితుడైన వరంగల్ అర్బన్ జిల్లాకు చెందిన పాశం పవన్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు గురువారం ఉదయం మండలంలోని జేఎన్‌టీయూ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా అనుమానించి వారిని పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా నిందితుడు వివరాలను వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. నిందితున్ని కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు. మిగతా నిందితులను పట్టుకుంటామన్నారు.

పనికి తగ్గ వేతనం అందడం లేదని ఉపాధి కూలీల ఆగ్రహం

చందుర్తి, మే 2: పనికి తగ్గ వేతనం రావడం లేదని ఉపాధి హామీ కూలీలు గురువారం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చందుర్తి మండల కేంద్రం శివారులో అటవీ ప్రాంతంలోని చీకటిలోయ ప్రాంతంలో మార్చి నుంచి దాదాపు 300 మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో భాగంగా కందకాలు తీసే పనులు చేస్తున్నారు. తమకు పనికి తగ్గ వేతనం రాలేదని ఉపాధి హామీ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ మాట్లాడుతూ పనులు సక్రమంగా చేయడం లేదని పేర్కొనడంతో, కొంత మంది కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను పరిశీలించకుండానే, ఇష్టానుసారంగా హాజరు వేస్తున్నారన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు మరొక టెక్నికల్ అసిస్టెంట్‌ను కేటాయించాలని ఏపీవోను కోరారు. ఏపీవో రాజయ్య మాట్లాడుతూ వేతనం తక్కువ రాకుండా, కొలతల ప్రకారం పేమెంట్ చేస్తామన్నారు.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

వడదెబ్బతో హమాలీ మృతి



గజ్జెల సంజీవ్ (ఫైల్)

శంకరపట్నం, మే 2: శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన హమాలీ వడదెబ్బతో మృతి చెందాడు. హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, వంగర గ్రామానికి చెందిన గజ్జెల సంజీవ్ (48) సుమారు 20సంవత్సరాల క్రితం జీవనోపాధి కోసం శంకరపట్నం మండలం లింగాపూర్ తన అత్తగారి ఊరులో హమాలీ పనిచేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. రెండ్రోజుల క్రితం వాంతులు, విరోచనాలు కావడంతో హుజూరాబాద్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి ఇంటికి వెళ్లాడు. 1న రాత్రి ఊపిరి ఆడకపోవడంతో కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

రాజ్యాంగంపై కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు

సిరిసిల్ల టౌన్, మే 2: బీజేపీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు మారుస్తుందని కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అనేక సార్లు హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీలను భూస్థాపితం చేయడం మాదిగల లక్ష్యం అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ కేటాయించలేదని ఆరోపించారు. రిజర్వేషన్లను మొదటి నుంచి బండి సంజయ్ బలపరుస్తూ వస్తున్నాడని అన్నారు. పది సంవత్సరాలు పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ వర్గీకరణపై ఒక్క చర్యల తీసుకోలేదని వర్గీకరణ కోసం పోరాడిన బిడ్డల్ని కేసీఆర్ జైలులో పెట్టించాడని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్గీకరణపై అంకితభావంతో ఉన్నాడని అన్నారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి జాతి మొత్తం అండగా ఉంటుందని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించిన కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ మే 4న చలో హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి, కో కన్వీనర్ పసుల బేష్, జిల్లా, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

కొండగట్టులో ముడుపుల ఆదాయం రూ.1.53లక్షలు

మల్యాల, మే 2: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో గత నెలలో జరిగిన చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా దీక్షాపరులు చెల్లించుకున్న ముడుపులను గురువారం దేవస్థానం అధికారులు లెక్కింపు చేపట్టారు. కొబ్బరికాయలు, బియ్యం, డబ్బులను వేర్వేరు చేసి లెక్కింపు చేయగా రూ.1,53,461 నగదు సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ముడుపుల కొబ్బరికాయలు, బియ్యంను వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ లెక్కింపులో ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు సునీల్‌కుమార్, చంద్రశేఖర్‌లతో పాటు రాజేశ్వర్‌రావు, జెమిని శ్రీనివాస్, ఉమామహేశ్వర్, శ్రీలలిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 215మంది మహిళ సేవకులు, ట్రస్ట్ నిర్వహకులు విశ్వనాథుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ముడుపుల సొమ్ములను లెక్కిస్తున్న ఆలయ అధికారులు

కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం

గణేశ్‌నగర్,మే 2: రాంనగర్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో భాగంగా కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సుల శిక్షణ ప్రారంభం అవుతున్నాయని ఆసక్తి గల యువతీ యువకులు రాంనగర్‌లో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నైపుణ్య శిక్షణకు అర్హులు ఏడవ తరగతి ఆ పైబడిన తరగతి పాసైన, ఫెయిల్ అయిన 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు, పురుషులు, స్త్రీలు కూడా అర్హులు అని తెలియజేశారు. ఈ శిక్షణ మూడు నెలలు ఉంటుందని తెలిపారు. కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. కోర్సు ఫీజు వివరాలు కంప్యూటర్ (ఎమ్మెస్ ఆఫీస్, డిటిపి) రూ. 1,000, బ్యూటీషియన్ రూ. 1500, అని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి తెలియజేశారు.

ఉచిత పశు వైద్య శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బోనగిరి నరేష్

ధర్మపురి, మే 2: రైతులు పంటలతో పాటు పశు పోషణ కూడ చేపట్టితే అదనపు ఆదాయం సాధించవచ్చని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బోనగిరి నరేష్ తెలిపారు. ధర్మపురి మండలంలోని మగ్గిడి-ఎడపల్లి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించి, పశు సంరక్షణ కోసం రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ మాట్లాడుతూ వ్యవసాయినిక సేంద్రీయ ఎరువు లభిస్తుందని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించవచ్చని పేర్కొన్నారు. ఒక సంవత్సరం లోపు వయస్సు ఉన్న దూడలకు నట్టల నివారణ కోసం ఫైపర్ జిన్ ఇంజక్షన్ ఇచ్చామని తెలిపారు. దేశీ ఆవుల సంతతిని పెంచాలని, పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే పశువుల సంత తి పెంచడానికి విద్యార్థులు రైతులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. పీఎంఈజీపీ, ఎన్ఎల్ఎం పథకాలు అందులో గల గురించి ఆయన వివరించారు. వ్యవసాయం అంటేనే పాడి పంటలు, వ్యవసాయ ఆధారిత రంగాలైన పశు పోషణ చేపలు, గొర్రెలు, కోళ్లు అంటూ ఆయన తెలిపారు. రైతులు సమీకృత వ్యవసాయం చేపట్టి ఆదాయాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బోనగిరి నరేష్, మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బద్దం రాజేందర్‌రెడ్డి, డాక్టర్ సునీల్, కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి. సౌజన్య, వి. రత్నాకర్, జి. ప్రజ్ఞ, విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డం వంశీని ఎంపీగా గెలిపించండి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కమాన్‌పూర్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్, మే 2: రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. గురువారం మండలంలో ఎన్నికల ప్రచారం చేశారు. ముందుగా కమాన్‌పూర్ క్రాస్ రోడ్డు నుంచి జూలపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశం పాల్గొని మాట్లాడారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతితో, అధిక ధరలతో, నిరుద్యోగంతో ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధిహామీ పనిదినాల పెంపుతో పాటు వేతనాలు పెంపుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి దఫాలో ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వైనాలా రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దుద్దిళ్ల శ్రీను బాబు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్ జైలుకే

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

కోరుట్ల రూరల్/మల్లాపూర్/సారంగాపూర్ మే 2: ఓటు నోటు కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జైల్‌కేనని... జూలై 14 ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డెడ్‌లైన్ అని... అందుకే కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఇప్పటి నుంచే సంబరాలు చేసుకుంటున్నారని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం కోరుట్ల మండలంలోని అయిలాపూర్, మల్లాపూర్ మండల కేంద్రంలో, సారంగాపూర్ మండలంలోని పెంబట్ల ధర్మపురి అర్వింద్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు అమలుపై ప్రజలు ప్రశ్నిస్తారని గమనించిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి రిజర్వేషన్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గాడిద గుడ్డు పెట్టడం ఎంత అబద్ధమో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకాలు కూడా అంతే అబద్ధమని పేర్కొన్నారు. కమలం పువ్వుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

● చొప్పదండి ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, మే 2: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మండలంలోని తురకకాశీనగర్, నమిలికొండ, శ్రీరాములపల్లి, తిప్పయ్యపల్లి, నల్లగొండ గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యం పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యరి వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. చొప్పదండి నియోజకవర్గ బిడ్డ రాజేందర్‌రావును ఎంపీగా గెలిపిస్తే అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందించే నిధులతో ఘననీయమైన అభివృద్ధి చేసే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీ నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, ఎంపీపీ స్వర్ణలత, సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచులు లతమల్లేశంయాదవ్ ఉన్నారు.

నిరుపేదల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి

మెట్‌పల్లి, మే 2: నిరుపేదల అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్ అన్నారు. గురువారం పట్టణంలో 217బూతు అధ్యక్షుడు బోడ్ల ఆనంద్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పదేండ్లల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కమలం పువ్వుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోడ్ల లత, లక్ష్మి, అనురాధ, చిన్నక్క, రాధా, విజయ, రమ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

రాయికల్, మే 2: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో మండలంలోని అల్లీపూర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన స్వర్గీయ మిట్టపల్లి రవీందర్‌రావు కుమారుడు మిట్టపెల్లి సుచేంద్ర రావు ప్రతిభ కనబరిచి పతకం సాధించాడు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు రెండవ స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం తరపున సుచేంద్ర పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎండవేడి తట్టుకునేలా చర్యలు తీసుకోవాలి

- జడ్పీ సీఈవో రఘువరన్

కోరుట్ల రూరల్, మే 2: ఉపాధి పనుల్లో కార్మికులు ఎండవేడి తాకిడి తట్టుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో రఘువరన్ సూచించారు. గురువారం మండలంలోని సంగెం, గుమ్లాపూర్, వెంకటాపూర్, నాగులపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనుల పరిశీలించారు. కూలీల హాజరు శాతాన్ని పరిశీలించి, ఎండ వేడికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండ దెబ్బ తగలకుండా తీసుకోవలన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వోదెల రామకృష్ణ, ఎంపీవో నీరజ, ఏపీవో మమత, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వెల్గటూర్: రోజు రోజుకూ ఎండతీవ్రత పెరుగుతుండడం వలన వడ దెబ్బ తగులకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్త వహించాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. గురువారం వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. వైద్య సిబ్బందికి వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో కూలీ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు 9 గంటల తరువాత వెళ్లకపోవడం మంచిదన్నారు. దాహం లేక పోయినా ప్రతీరోజు తప్పని సరిగా మూడు నుంచి నాలుగు లీటర్ల నీటిని తాగాలని సూచించారు. రోజూ పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల తీసుకోవడం మంచిదని సూచించారు. లైట్ కలర్‌లో ఉన్న వదులుగా ఉన్న బట్టలు వేసుకోవాలని సూచించారు.



ఉపాధిహామీ కార్మికులకు సూచనలు చేస్తున్న జడ్పీ సీఈవో రఘువరన్



వెల్గటూర్‌లో మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్

ఎండకు వెళ్లినపుడు తలకు టోపీలు, రుమాలు తప్పనిసరిగా ధరించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, గుండె జబ్బులు, దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారు ఎండకు బయట తిరగక పోవడం ఉత్తమమని పేర్కొన్నారు.

అత్యవసరం అయితే తప్ప అది కూడా ఉదయం 11లోపు తమ తమ వ్యక్తిగత పనులను చేసుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. ప్రసుతం రోజు 46 డిగ్రీల ఉష్ణోగ్రత దాటుతోందని, మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. వడ దెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని చల్లని నీటితో తుడవాలని, చల్ల గాలి తగిలే విధంగా చూడాలన్నారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించాలని పేర్కొ న్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్, సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత..

మెట్‌పల్లి: పారిశుధ్య కార్మికులు మండుతున్న ఎండలో పనులు చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. గురువారం మెట్‌పల్లి పురపాలక కార్యాలయంలోని పారిశుధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య పనులు చేస్తున్న సమయంలో ఎండబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులు చేస్తున్నప్పుడు తమ వెంట తాగేందుకు మంచినీరు ఉంచుకోవాలన్నారు. మురికి కాలువలు తీసేటప్పుడు నీడ పట్టును ఉండి పనులు చేయాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ముజీబ్, నిజాం, అశోక్, నరేష్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మోహన్

ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉన్నా..

ఎంపీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 2: తెలంగాణ ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉన్నానని, ప్రజల పక్షాన పోరాటం చేసి జైలు వెళ్లానని ఎంపీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ దేశమంతా నరేంద్ర మోదీ గాలి వీస్తుంటే అక్కసుతో రిజర్వేష్లపై అబద్ధాలు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తే రిజర్వేషన్లపై వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడని ఆయన విమర్శించారు. మే 13న జరిగే ఎన్నికలను, ఎండలను లెక్క చేయకుండా ప్రతి ఒక్కరూ కదిలి వచ్చి బ్యాలెట్ పేపర్‌లోని ఒకటో నంబర్ పక్కనున్న పువ్వు గుర్తు బటన్ నొక్కి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యకర్తలకే తెలియని వ్యక్తికి ఓటేసి లాభమేంటన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికలప్పుడు తప్ప ఎన్నడూ కనిపించడని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ రావులు అని, వారికి ఓటేస్తే ప్రజలకు ఏమీ రావన్నారు. ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేసుకుని మీకోసం పోరాటం చేసే వాళ్లకు ఓటేయాలన్నారు. నాన్ లోకల్ వినోద్‌రావు ఎన్నికప్పుడు తప్ప ఎన్నడు ప్రజలకు కనిపించరన్నారు. రాజేందర్‌రావు ఎవరో కార్యకర్తలకే తెలియదన్నారు. శ్రీరామడి అక్షింతలను సైతం కించపర్చేస్థాయికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు దిగజారారన్నారు.



బండి సంజయ్‌కుమార్‌కు గజ మాల వేసి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

హామీలు అమలు చేస్తున్న కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పెగడపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, మే 2 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నాలుగింటిని అమలు చేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికలలో పట్టం కట్టాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని రాజారాంపల్లిలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరు కానున్న బహిరంగ సభ విజయవంతం కోసం పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు గురువారం పెగడపల్లిలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలం నుంచి ఆరు వేల మందికి పైగా జనాలను తీసుకురావాలని, ముఖ్యమంత్రి సభ విజయవంతం కోసం ప్రతి కార్యకర్త తానే లక్ష్మణ్ కుమార్‌గా భావించి పని చేయాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ఎగ్గెలకుంట శివారులోని ఉపాధిహామీ పని ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నాలుగు గ్యారంటీలను అమలు చేశామని, ఆరు గ్యారంటీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండా అంటూ, హామీల అమలు చేయకపోతే తిరిగి ఓట్లడిగేందుకు రానంటూ, అసెంబ్లీ ఎన్నికలలో చూపించిన విధంగానే ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పైన ప్రజలు నమ్మకం చూపించి ఓట్లేయాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, నాయకులు కడారి తిరుపతి, పూసాల తిరుపతి, రాజేందర్, స్వామి, అమిరిశెట్టి మల్లారెడ్డి, ప్రశాంత్, ప్రవీణ్, కొమురయ్య, భాస్కర్, కిషన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి



ఓట్లు అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

జగిత్యాల టౌన్, మే 2 : అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జీవన్ రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం అంగడి బజార్‌లో ప్రచారం నిర్వహించారు. మహిళా నాయకురాళ్లు హన్మాండ్ల జయశ్రీ, పిప్ప రి అనిత, రఘ, మహేదర్ ఉన్నారు.

పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవం

ముస్తాబాద్, మే 2: మండలంలోని ఆవునూర్‌లో ముదిరాజ్ సామాజివర్గం ఆధ్వర్యంలో పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ మహోత్సవాన్ని గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, నక్కదాసరి రవి, సామాజిక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

'బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి'

కోరుట్ల రూరల్, మే 2 : నిజామాబాదు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నమెట్‌పల్లి, జోగినిపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ మాట్లాడారు. రాష్ట్రంలో బీ ఆర్ఎస్ ప్రభుత్వ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేసిందని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి అప్పడి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేసిన కృషి గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గుతుంది

మెట్‌పల్లి, మే, 2 : క్రీడలతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా చురుకుదనం గా తయారవ్వడానికి ఎంతో ఉపయోగపడ తాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి అన్నారు. గురువారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ మినీ స్టేడియంలో చినారులకు ఏర్పాటు చేసిన వేసవి క్రీడీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారలు చిన్నతనంలో క్రీడలు ఆడడం తో మానసిక ఒత్తిడికి లోనుకాకుండా శరీరధృడ త్వానికి ఎంతోగానే ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆటలు నేర్పించేం దుకు ముందుకు రావాలన్నారు. చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమేనన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గజల్లి రాము దాస్, కోచ్ మారిపల్లి కార్తీక్, గంగాధర్ పాల్గొన్నారు.

వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

రాయికల్, మే 2: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, జగిత్యాల ఆధ్వర్యంలో ఉచిత వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి, రవీష్ రెడ్డి, దివాకర్‌లు గురువారం ప్రారంభించారు. విద్యార్థులు వేసవిలో చెడు తిరుగుడుకు అలవాటు పడకుండా, క్రీడల పట్ల శారీరక, మానసిక ధృడత్వం పొందుతానని అన్నారు. ఈ శిక్షణ నెల రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 5వ తరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల విద్యార్థులు, యువత ఈ సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవా లన్నారు. కాగా నెల రోజుల పాటు జరిగే వేసవి శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు ప్రతి రోజు అందించే స్నాక్స్‌ను ఉచితంగా అందజేయనున్నట్లు విజేత స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు సోమ రమేష్ రెడ్డి తెలిపారు. క్రీడాకారులు ఈ శిబిరంలో మెళకువలు నేర్చుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు.



వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

టీపీసీసీ నిజామాబాద్ లీగల్ సెల్ కో-ఆర్డినేటర్‌గా జగదీశ్వర్



జగిత్యాల, మే 2 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్‌గా జగిత్యాలకు చెందిన సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు గుంటి జగదీశ్వర్‌ను నియమిస్తూ కమిటీ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంలో భాగంగా నూతన నియామకం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీలు తాటిపర్తి జీవన్ రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జువ్వాడి నర్సింగ్ రావులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

నేటి నుంచి హోం ఓటింగ్‌కు అవకాశం

కథలాపూర్, మే 2 : ఈ నెల 3 నుంచి 5 దాకా హోం ఓటింగ్‌కు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 30 మందిని 85 ఏళ్ల దాటిన, దివ్యాంగులు హోం ఓటింగ్‌కు అర్హులుగా గుర్తించామన్నారు. స్థానిక బీఎల్‌ఓల సహాయంతో ప్రిసైడింగ్ అధికారి నిర్దేశిత ఓటర్ల ఇంటింకి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

'మోదీ పర్యటనను విజయవంతం చేయాలి'

మల్యాల, మే 2: ఈ నెల 8న కరీంనగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా వేములవాడలో ప్రధాని మోదీ నిర్వహించే ప్రచార కార్యక్రమంకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు హాజరుకావాలని మండల బీజేపీ అధ్యక్షుడు నెరెళ్ల శ్రావణ్ పిలుపునిచ్చారు. మల్యాలలో గురువారం విలేఖరులతో మాట్లాడుతూ బండి సంజయ్‌ను అధిక మెజార్టీతో రెండవ సారి గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప మిగితావి అమలు చేయకుండా మోసగిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ సమావేశంలో వెంకటస్వామి, గాజుల మల్లేశం, నులుగొండ సురేష్, పిల్లి రాజశేఖర్, కొక్కెర శ్రీనివాస్, రాకేష్‌గౌడ్, ఆనందం, గవాస్కర్ పాల్గొన్నారు.

సిరికొండలో బీఆర్ఎస్ నేతల ప్రచారం

కథలాపూర్, మే 2 : కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా మండలంలోని సిరికొండలో గురువారం బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గతంలో వినోద్‌కుమార్ కరీంనగర్ అభివృద్ధి కోసం ఎంతో చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మామిడిపల్లి రవి, దశ గౌడ్, జలంధర్, ఎంజీ రెడ్డి, ఎక్బాల్, ముజీబ్ ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

వెల్గటూర్, మే 2: మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగురాలు రాయంచు వాసవికి నిత్యావసర సరుకులు గురువారం తెలంగాణ ఆర్య వైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల రమేష్ గుప్తా అందజేశారు. వాసవి పరిస్థితి గురించి జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రికి తెలియజేయగా వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ.2 వేల నగదుతో పాటు సుమారు రూ.6 వేల విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు. బొంగాని మారుతి, మహమ్మద్, దుర్గం శ్రావణ్, కృపాకర్ పాల్గొన్నారు.

కొప్పులకు మద్దతుగా ప్రచారం

వెల్గటూర్, మే 2: రాబోయే పార్లమెంట్ ఎన్నికలల్లో పెద్దపెల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కాంక్షిస్తూ గురువారం మండలంలోని ముత్తునూర్, జగదేవ్‌పేట గ్రామాలలో ఉపాధి హామి కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, ఎంపీపీ లక్ష్మి, జూపాక కుమార్, తిరుపతి, రాజేశ్వర్‌రెడ్డి, భరత్, సత్యం, శ్రీధర్, వేణు, సురేందర్, గంగయ్య, మాధవరెడ్డి, ఆశీర్వాదం, రవి పాల్గొన్నారు.

సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 2: లోక్ సభ ఎన్నికలకు సంబంధించి జిల్లాకు అదనంగా కేటాయించిన బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు బ్యాలెట్ యూనిట్ల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు.